క్లుప్తంగా

లలితా పీఠంలో 1న హనుమజ్జయంతి



ఏయూ క్యాంపస్: స్థానిక కిర్లంపూడిలోని లలితా పీఠంలో వచ్చేనెల 1న హనుమజ్జయంతిని నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన పురోహితుడు కాందూరి లక్ష్మణస్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీఅభయాంజనేయస్వామికి సహస్ర తమల పత్ర సింధూరార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు రూ.100 చెల్లించాలని, వారికి ప్రసాదం, రక్షాబంధన్ అందిస్తామన్నారు.

సెంచురీ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

బీచ్ రోడ్డు: ఐబీపీ సెంచురీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. క్లబ్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎస్.విష్ణుమూర్తిరాజు, ఉపాధ్యక్షుడిగా ఎం.వి.శర్మ, కార్యదర్శిగా వాసిరెడ్డి శ్రీమంత్, కోశాధికారిగా రమేష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. 2024–25 వరకు కొనసాగే కొత్త కార్యవర్గానికి క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

108 వాహనాల రికార్డుల పరిశీలన



వాహనంలో రికార్డును పరిశీలిస్తున్న 108 జోనల్ మేనేజర్ నజీర్

మహారాణిపేట : గర్భిణులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించాల్సిన అంశాలను ఈఎంటీలకు 108 విభాగ జోనల్ మేనేజర్ నజీర్ వివరించారు. సోమవారం ఆయన కేజీహెచ్ గైనిక్, అత్యవసర వార్డులను సందర్శించి, రోగులను ఏ విధంగా పెద్దాస్పత్రికి తరలిస్తున్నారో వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 102,104,108వాహనాల్లో మందుల కొరత ఉండకూడదని, వాహనాలు కూడా శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం 108 రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో 108 విభాగ విశాఖ సిటీ కో–ఆర్డినేటర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



పరతాపు రాజేష్

మద్రిపాలెం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం గెడ్డ వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివససిస్తున్న పరతాపు రాజేష్ ఓ మందుల షాపులో పనిచేస్తున్నాడు. ఇతడికి సుమారు పదేళ్ల నుంచి మతిమరుపు ఉంది. తల్లి మందులు వేసుకోమని చెప్పినందుకు ఆమెతో గొడవపడి ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటి వరకు చేరుకోలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉంది. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అతడి తల్లి రాణి ఫిర్యాదు చేసినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. రాజేష్ 5.2 అంగుళాల పొడవు, తెల్లరంగు ఛాయతో ఉంటాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు నల్ల జీన్ ప్యాంట్, గళ్ల షర్ట్ ధరించి ఉన్నాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు. హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

జూకు కొత్త హంగులు



మీర్‌క్యాట్ ఎన్‌క్లోజర్

పక్షుల జోన్‌లలో అద్దాలతో ఆధునికీకరించిన బర్డ్స్ ఎన్‌క్లోజర్లు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొత్తదనం సంతరించుకుంటోంది. ఇతర ప్రాంతాల జూ పార్కుల నుంచి తీసుకొచ్చిన కొత్త వన్యప్రాణులతో పాటు కొత్త నిర్మాణాలతో కళకళలాడుతోంది. జూలో అధికారులు ఇటీవల అవసరమైన పలు భవన నిర్మాణాలు చేపట్టారు. వాటిలో కొన్ని నిర్మాణాలు పూర్తికాగా మరికొన్ని తుది దశలో ఉన్నాయి. ఇంకొన్ని పనులు ప్రారంభించాల్సి ఉంది. వన్యప్రాణులకు అవసరమైన ఎన్‌క్లోజర్ల నిర్మాణంతో పాటు సందర్శకుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. జూలో రెండేళ్లలో సుమారు రూ.4 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఐవో సీఎల్ సీఎస్ఆర్ నిధులను రూ. 2 కోట్లు అందించింది. ఆ నిధులతో జూ పార్కులో బయోస్కోప్ ఆధునికీకరణ, హిమాలియన్ బేర్ నైట్‌క్రాల్, హైనా మోట్, పాముల జోన్ వద్ద మరుగుదొడ్లు, ఖడ్గమృగం నైట్‌క్రాల్ నిర్మాణాలు చేపట్టారు. వీటిలో బయోస్కోప్ భవనం నిర్మాణంలో ఉంది. మరో రూ.2 కోట్ల జూ నిధులతో మీర్‌క్యాట్ ఎన్‌క్లోజర్, రెండు స్లాత్ బేర్ ఎన్‌క్లోజర్లు, బార్కింగ్ డీర్ నైట్‌క్రాల్, డేక్రాల్ ఎన్‌క్లోజర్, సావనీర్ షాపు, రెండు చోట్ల చిన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఎన్‌క్లోజర్ల వద్ద సందర్శకుల సౌలభ్యం కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వీటితో పాటు జూలో డీర్ సఫారీని పునః ప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఇందు కోసం రిలయన్స్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లు ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఆ నిధులతో డీర్ సఫారీ, హుద్‌హుద్ సమయంలో కూలిపోయిన రాబందుల ఎన్‌క్లోజర్‌ను అభివృద్ధి చేయనున్నారు. టయోటో సంస్థ కూడా జూ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. ఆ నిధులతో జూ ప్రధాన ద్వారాన్ని ఆధునికీకరించడానికి జూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



పాముల జోన్ వద్ద సందర్శకుల కోసం కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు



జూలో నిర్మాణంలో ఉన్న బయోస్కోప్ భవనం



కోతుల జోన్‌లో నిర్మాణంలో ఉన్న పాత్‌వే

ఇంటర్ పరీక్షలకు 42 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : స్థానిక డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 42 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం బోటనీ ఇంగ్లిష్ మీడియం పరీక్షకు 43 మంది హాజరు కావాల్సి ఉండగా, ముగ్గురు, తెలుగు మీడియం పరీక్షకు ఒకరు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. మ్యాథ్స్ ఇంగ్లిష్ మీడియంలో 332 మందికి 10 మంది, సివిక్స్ ఇంగ్లిష్ మీడియంలో 37 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. తెలుగు మీడియంలో 12 మందికి ఐదుగురు పరీక్ష రాయలేదన్నారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం బోటనీ ఇంగ్లిష్ మీడియం పరీక్షకు 44 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. మ్యాథ్స్‌లో ఇంగ్లిష్ మీడియం పరీక్షకు 271 మంది హాజరు కావల్సి ఉండగా 13 మంది గైర్హాజరయ్యారు. సివిక్స్ ఇంగ్లిష్ మీడియంలో ఏడుగురు, తెలుగులో ఒకరు పరీక్ష రాయలేదని ఆయన తెలిపారు.

ఓపెన్‌హైమర్ చిత్ర ప్రదర్శన రేపు

మద్దిలపాలెం : ఇటీవల ఉత్తమ చిత్రంగా ఆస్కార్ అవార్డు దక్కించుకున్న ఓపెన్‌హైమర్ చిత్ర ప్రదర్శన బుధవారం విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో రూపొందిన ఓపెన్ హైమర్ చిత్రాన్ని సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రుతుక్రమంపై అవగాహన అవసరం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, పలు విభాగాల అధికారులు

మహారాణిపేట: రుతుక్రమంపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రొగ్రాం అధికారుల సమావేశంలో రుతుక్రమం–ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో నెలసరి అనేది సాధారణ శరీర ప్రక్రియ అని, సాధారణంగా 10 నుంచి 14 సంవత్సరాలలోపు మొదలై 45–49 సంవత్సరాల మధ్యలో రుతుక్రమం ఆగిపోతుందని చెప్పారు. 'టుగెదర్ ఫర్ ఏ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్'(నెలసరి సమయంలో స్నేహపూర్వకంగా ఉండటం) ఈ సంవత్సరం నినాదమని చెప్పారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థినులకు అందుబాటులో శానిటరీ నాప్‌కిన్‌లు, ఐరన్ ఫోలిక్ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పలు విభాగాల ఇన్‌చార్జి డాక్టర్ సమత, మురళీకృష్ణ, ఐ.మనోరమ, డాక్టర్ హీనా దీక్షిత్, శాంతి ప్రియ, నాగభూషణం, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

విజయవంతంగా రోబోటిక్ మోకాళ్ల మార్పిడి చికిత్సలు



రోబోటిక్ శస్త్ర చికిత్సల గురించి వివరిస్తున్న డాక్టర్ రవిచంద్ర బృందం

ఆరిలోవ: హెల్త్ సిటీలోని అపోలో ఆస్పత్రిలో రోబోటిక్ ఆర్మ్ ఉపయోగించి 25 మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. డాక్టర్ వి.రవిచంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ రఘు యలవర్తితో కలిసిన బృందం ఈ రోబోటిక్ శస్త్రచికిత్సలు అత్యున్నతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతితో పోల్చితే రోబోటిక్ శస్త్ర చికిత్స ఖచ్చితమైన ఫలితాలు అందిస్తాయన్నారు. శస్త్ర చికిత్స సమయం సగటు సుమారు 75 నిమిషాలు పడుతుందన్నారు. ఈ విధానంతో రోగి కూడా త్వరగా కోలుకుంటారని తెలిపారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప విగ్రహ ప్రతిష్ట



వార్షికోత్సవంలో ప్రత్యేక పూజలు

దాబాగార్డెన్స్: పాతనగరం వన్‌టౌన్ రాజప్ప నాయుడు వీధిలోని గీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప భగవానుని పాలరాతి మూర్తులు ప్రతిష్ఠించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని 25వ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఓం నమో భగవతే వాసుదేవాయ ద్వాదశాక్షరి కోటి లిఖిత మహా యజ్ఞంతో కూడిన స్థూపాన్ని ప్రారంభించారు. సంఘ సేవకుడు కొప్పుల రామ్‌కుమార్ ఈ స్థూపాన్ని ప్రారంభించారు. గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

జోరుగా వాహనాల తనిఖీలు

22 వాహనాలకు జరిమానా



ద్విచక్ర వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ఎన్నికల కౌంటింగ్ డే సమీపిస్తున్న తరుణంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ తనిఖీలు జోరుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఎస్ఐ జి.వెంకటరావు ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేసి, వాటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన రికార్డులు లేని 22 వాహనాలకు రూ.8 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహన చోదకులతో మాట్లాడుతూ విధిగా అందరూ హెల్మెట్లు ధరించాలని స్పష్టం చేశారు. రాంగ్ పార్కింగ్ చేస్తే రూ.1,035 జరిమానా విధిస్తామని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముగ్గురమ్మల జాతర

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29, 30 వార్డుల గ్రామ దేవతలు పోలమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ 24వ జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవార్ల ఘటాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, మేళ తాళాలు డప్పు వాయిద్యాల నడుమ సాగింది. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని అంగటిదిబ్బ, రామజోగిపేట, భుజంగరావుపేట, దండుబజార్, దిబ్బలపాలెం, చందకవీధి, కుమ్మరవీధి, కృష్ణానగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. మంగళవారం అమ్మవార్ల జాతర వేడుకగా నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 250 మంది ఎంపిక



ఎంపికైన వారితో నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, జేసీఐ భారత్ యువ సంకల్ప్ కన్సల్టెన్సీ సంయుక్తంగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించాయి. సర్వీస్, ఫైనాన్స్, బీమా, సాఫ్ట్‌వేర్ రంగాలకు సంబంధించి 32 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ విభాగాలకు సంబంధించి 650 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా, 250 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు ప్రాంభించిన కార్యక్రమంలో గ్లోబల్ ట్రస్ట్ నుంచి పి శ్రీనివాసరావు, జేసీఐ అధ్యక్షుడు చంద్రశేఖర్, అమెజాన్ హెచ్ఆర్ ఆర్ సునీల్, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి, వివిధ పరీక్షల ద్వారా పలువుర్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్ని దుర్గమాంబ ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్న మేయర్ దంపతులు

ఆరిలోవ: స్థానిక తోటగరువులో ఎర్ని దుర్గమాంబ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 25న ప్రారంభమైన వేడుకలు ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనున్నాయి. సోమవారం తొలేళ్ల ఉత్సవం సందడిగా సాగింది. మంగళవారం అమ్మవారి అనుపు మహోత్సవం జరగనుంది. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయి. బాణసంచా వెలుగుల మధ్య భారీ ఊరేగింపు చేపట్టనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు సోమవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేయర్ దంపతులు ద్వారకా తిరుమల వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఒమ్మి శ్రీనివాస్, మొల్లి అప్పలరాజు, మొల్లి జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ ఆఫీస్ పనుల పరిశీలన



జోన్-3 కార్యాలయ మరమ్మతులను పరిశీలిస్తున్న ఏడీసీ విశ్వనాథన్

సీతమ్మధార: ఆశీలమెట్ట వద్ద గల జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో మరమ్మతులు, ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటిని సోమవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ పరిశీలించారు. ఆయనకు పనుల పురోగతి గురించి జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఇంజినీర్లు వివరించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ జోనల్ ఆఫీస్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

24వ వార్డులో ఏడీసీ పర్యటన

జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో సోమవారం ఏడీసీ విశ్వనాథన్ పర్యటించారు. ఇక్కడ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. అనంతరం వివేకానంద కల్యాణ మండపం రోడ్డు నుంచి శివాలయం మీదుగా వీధిలోకి వెళ్లే కాలువలను, యూజీడీ పనులను పరిశీలించి, డ్రైనేజీ ఎత్తుపల్లాలను సరిచేయాలని ఇంజినీర్లకు ఆయన సూచించారు. కాలువల మీద అవసరమై చోట్ల గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, ఈ మేరకు అంచనాలు రూపొందించాలని చెప్పారు. స్థానిక ప్రజలను ఏడీసీ విశ్వనాథన్ సమస్యలు అడిగి తెలుసుకుని, అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, సహాయ వైద్యాధికారి ప్రసాద్, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఈఈ రమణమూర్తి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటరీ సెక్రటరీ ఉన్నారు.

చురుగ్గా దివ్యాంగ బాలల సర్వే

- 16 మంది గుర్తింపు
- ఎంఈవో రవీంద్రబాబు



మధురవాడలో విద్యార్థి పేరును భవిత కేంద్రంలో నమోదు చేయిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

మధురవాడ: బడి బయట ఉన్న విద్యార్థులతో పాటు దివ్యాంగ బాలల సర్వేను చురుగ్గా నిర్వహిస్తున్నట్టు విశాఖ రూరల్ మండల విద్యాశాఖాధికారి సీహెచ్.రవీంద్రబాబు చెప్పారు. ఆరిలోవ, నేతాజీనగర్, మధురవాడలలో బడి బయట ఉన్న దివ్యాంగులను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమాలను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి జూన్ 9వరకు దివ్యాంగుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భవిత కేంద్రాల ద్వారా విద్య అందించడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలు, ఫిజియోథెరపీ సేవలు, ఉపకార వేతనాలు, రాయితీలు అందిస్తున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు 16 మంది దివ్యాంగులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం శిక్షకులు ఎస్.మహాలక్ష్మి, ఎస్‌కే సలీమా తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారికి సారె సమర్పణ



సారెతో మహిళల ఊరేగింపు

గాజువాక : పాత కర్ణవానిపాలెం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి సోమవారం సారె సమర్పించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు వివిధ రకాల పళ్లు, స్వీట్లతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి సారెను అందజేశారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నిర్వహించనున్న నేపథ్యంలో సారెను సమర్పించినట్టు గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. పెద్ద పండగ సందర్భంగా బళ్ల వేషాలతో ఊరేగింపుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, మడగల కన్నయ్య, గొంతిన దేముడు, కరణంరెడ్డి రాము, సాలాపు నూకరాజు, కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో కూలిన చెట్టు వద్ద గుమిగూడిన జనం

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ పాల బూత్ సెంటర్‌లోని సాయిబాబా గుడి వద్ద సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో చెట్టు అకస్మాత్తుగా కూలిపోయింది. అటుగా వెళ్తున్న ఆటో ముందు భాగంపై పడటంతో ఆటో స్వల్పంగా ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఆటోలో ఉన్న వారికి కాని, చుట్టుపక్కల వారికి గాని ఏమీ కాలేదు. నిత్యం రద్దీగా ఉండే కూడలిలో చెట్టు పడే సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది సేపటి కిందటే భారీ కంటైనర్ అటు వైపు వెళ్లిందని, దాని పైభాగం చెట్టు కొమ్మకు గట్టిగా ఢీకొట్టిందని, కంటైనర్ వెళ్లిన కొద్ది సేపటికి చెట్టు కూలిపోయింది స్థానికులు తెలిపారు. చెట్టు కొమ్మలు తొలగించి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు.